

సీఎం మాట నిలుపుకోవాలి

తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేస్తామని ఇచ్చిన మాటను సీఎం నిలబెట్టుకోవాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు డిమాండ్ చేశారు.

- 8లో ▸



రైతుకు బేడీలు సిగ్గుచేటు

లగచర్లలో రైతుకు బేడీలు వేసిన ఘటనపై బీజేపీ, భారతీయ కిసాన్ సంఘ్ నేతలు నిరసన తెలిపారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
27.6 /9.3

ఉదయం మంచు కురుస్తుంది. శీతల గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

‘పెండింగ్ బిల్లులు చెల్లించాలి’



కామారెడ్డి అర్బన్: విజయ డెయిరీకి రావాల్సిన పాడి రైతుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డెయిరీ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి కోరారు. ఈ విషయమై ఆయన శుక్రవారం హైదరాబాద్‌లో తెలంగాణ స్టేట్ డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్(టీఎస్‌డీడీసీఎఫ్) రాష్ట్ర చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. బిల్లులు త్వరగా చెల్లించేందుకు చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారని తిరుపతిరెడ్డి తెలిపారు.

‘లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి’

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని కోర్టులో శనివారం నిర్వహించే లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి టి.నాగరాణి సూచించారు. రాజీయే రాజమార్గం అని పేర్కొన్నారు. సివిల్, వైవాహిక, భూ విభజన, కార్మిక, బ్యాంకు రికవరీ తదితర వివాదాల కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. కోర్టులో మొత్తం 7 బెంచీలతో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

శబరిమలకు ప్రత్యేక బస్సు సౌకర్యం



కామారెడ్డి టౌన్: శబరిమలకు వెళ్లేందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పిస్తోందని సంస్థ ఆర్ఎం టి.జోత్స్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని నిజామాబాద్, కామారెడ్డి, బాన్సువాడ, ఆర్మూర్, బోధన్ డిపోల నుంచి స్పెషల్ హైర్ బస్సులు నడపుతామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బుకింగ్ కోసం సంప్రదించాల్సిన ఫోన్‌నంబర్లు..

డిపో	ఫోన్‌నంబర్
కామారెడ్డి	73828 43747
బాన్సువాడ	94911 05706
నిజామాబాద్	99592 26022
ఆర్మూర్	73828 43133
బోధన్	98495 00725

ఐదేళ్లూ గ్యారంటీ

- సన్నరకాలకు బోనస్, మహాలక్ష్మి పథకాలు కొనసాగిస్తాం
- సంక్రాంతి నుంచి రైతు భరోసా అందిస్తాం
- నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- నిజాంసాగర్ నుంచి నీటి విడుదల ప్రారంభం



నిజాంసాగర్ ప్రాజెక్టు వద్ద పూజలు చేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పోచారం, సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంతారావు, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిజాంసాగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నంత కాలం సంక్షేమ పథకాలను కొనసాగిస్తామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన హైదరాబాద్‌నుంచి హెలికాప్టర్ ద్వారా నిజాంసాగర్ మండలంలోని గోర్గల్ గేటు వద్దకు చేరుకున్నారు. హెలిపాడ్ వద్ద ఆయనకు ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంతారావు, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తదితరులు స్వాగతం పలికారు. అక్కడినుంచి రోడ్డుమార్గం ద్వారా మంత్రి ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. బాన్సువాడ, బోధన్, జుక్కల్ ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంతారావులతో కలిసి నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటి విడుదలను ప్రారంభించారు. అనంతరం గుల్‌దస్తా వద్ద విలేకరులతో మాట్లాడారు. తాము అధికారంలో ఉన్నంత కాలం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకం కొనసాగుతుందన్నారు. సన్నరకాలు పండించిన రైతులకు క్వింటాలుకు రూ. 500 చొప్పున ఐదేళ్లు చెల్లిస్తామన్నారు. సంక్రాంతి పండుగ తర్వాత రైతు భరోసా ప్రారంభిస్తామన్నారు. రైతు బీమా, పంటల బీమా పథకాన్ని అమలు చేస్తామన్నారు. త్వరలోనే కొత్త రేషన్ కార్డులను మంజూరు చేస్తామన్నారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇచ్చి కోటి మందిని కోటీశ్వరులను చేస్తామన్నారు. రైతులు, రైతు కూలీలు, యువకులు, నిరుద్యోగుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. ఐదేళ్లలో అద్భుతమైన విజయాలను సాధిస్తామన్నారు. నాగమడుగు ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తి చేయిస్తామన్నారు. అంతర్రాష్ట్ర లెండి ప్రాజెక్టు నిర్మాణం విషయమై మహారాష్ట్ర ప్రభుత్వంతో పాటు అక్కడి అధికారులతో మాట్లాడి పనులు జరిగేలా చూస్తానన్నారు.



మంత్రికి స్వాగతం పలుకుతున్న జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు


నిరుద్యోగులను నిర్లక్ష్యం చేశారు

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో నిరుద్యోగులు నిర్లక్ష్యానికి గురయ్యారని మంత్రి పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య రెట్టింపయ్యిందన్నారు. తాము అధికారంలోకి వచ్చాక 55 వేల ప్రభుత్వ ఉద్యోగాలను, 11 వేల టీచర్ పోస్టులను భర్తీ చేశామని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యేలు

ముందస్తుగా పంటల సాగు..



నిజాంసాగర్ ప్రాజెక్టును తిలకిస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు, కలెక్టర్

నిజాంసాగర్ ప్రాజెక్టు కింద వానాకాలం, యాసంగి సీజన్లలో ముందస్తుగా పంటలు సాగు చేస్తున్నామని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. సింగూరు ప్రాజెక్టు నుంచి మూడు, నాలుగు టీఎంసీల నీటిని నిజాంసాగర్ ప్రాజెక్టుకు విడుదల చేయిస్తే ఆయకట్టుకు మేలు జరుగుతుందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. అత్యంత వెనకబడిన జుక్కల్ నియోజకవర్గంలోనే నిజాంసాగర్ ప్రాజెక్టు ఉన్నా 2,700 ఎకరాలకు మాత్రమే సాగు నీరు అందుతుందని స్థానిక ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. లెండి ప్రాజెక్టుతో పాటు నాగమడుగు ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేయిస్తే నియోజకవర్గం సస్యశ్యామలం అవుతుందని పేర్కొన్నారు. కౌలాస్ నాలా ప్రాజెక్టు కట్టినప్పటి నుంచి మరమ్మతులు లేక కాలువలు శిథిలావస్థకు చేరాయన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ బాల్‌రాజ్, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, మాజీ ఎమ్మెల్యే రవీందర్ రెడ్డి, పిట్లం మార్కెట్ కమిటీ చైర్మన్ మనోజ్ పటేల్, కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్, రమేష్‌యాదవ్, ఆకాష్, బాల్‌సాయిలు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లలో జాప్యం చేయొద్దు



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

- ఎప్పటికప్పుడు పత్తిని తూకం వేయాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

మద్నూర్: పత్తి కొనుగోళ్లలో జాప్యం జరగకుండా చూసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. సీసీఐ కేంద్రానికి పత్తి తీసుకువచ్చిన రైతులతో మాట్లాడారు. పత్తి కొనుగోళ్లు, ధర, ఎన్ని రోజులకు డబ్బులు జమ అవుతున్నాయి అన్న విషయాలు తెలుసుకున్నారు. సీసీఐ కేంద్రంలో దళారుల ప్రమేయం లేకుండా పత్తి కొనుగోళ్లు జరపాలన్నారు. తూకాల్లో మోసాలకు పాల్పడినా, తక్కువ ధరకు పత్తిని కొనుగోలు చేస్తున్నా ఫిర్యాదు చేయాలని రైతులకు సూచించారు.

ఫ్యాక్టరీ పరిశీలన

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పత్తి ఫ్యాక్టరీని సందర్శించారు. పత్తి నుంచి గింజలు వేరుచేయడం, పత్తిని బేళ్లుగా మార్చడాన్ని పరిశీలించారు. ఇప్పటివరకు 14,014 మంది రైతులనుంచి 43,245 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశామని సీసీఐ అధికారి ఓబుల్‌రెడ్డి కలెక్టర్‌కు వివరించారు. ఇందులో 27,733 క్వింటాళ్లకు సంబంధించి రూ. 20 కోట్లను రైతుల ఖాతాలలో జమ చేశామన్నారు. ప్రైవేట్‌లో వ్యాపారులు 75,196 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారని వివరించారు. కలెక్టర్ వెంట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సౌజన్య, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, జిల్లా మార్కెటింగ్ అధికారి రమ్య, మండల స్పెషల్ ఆఫీసర్ నాగరాజు, సీసీఐ అధికారులు, రైతులు ఉన్నారు.

‘ఇందిరమ్మ’ సర్వే వేగం పెంచాలి



సర్వే వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ సంగ్వాన్, సబ్ కలెక్టర్ కిరణ్మయి

బిచ్కుంద: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు సంబంధించిన సర్వేను వేగవంతం చేయాలని ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. శుక్రవారం ఆయన ఫత్లాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఇంటిని సందర్శించాలని, దరఖాస్తుదారులకు ఇల్లు ఉందా లేదా, నిర్మించుకోవడానికి అనువైన స్థలం ఉందా అన్న వివరాలను యాప్‌లో నమోదు చేయాని ఆదేశించారు. సర్వే ఒకరోజు ముందు గ్రామంలో చాటింపు వేయాలని సూచించారు. అధికారులు రోజూ సర్వే తీరును పరిశీలించాలన్నారు.

ఏటీసీ సందర్శన

మండల కేంద్రంలోని ఐటీఐ కళాశాలలోని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)ను కలెక్టర్ సందర్శించారు. భవన నిర్మాణ పనులు, ఏటీసీ సెంటర్‌లో తరగతులు నిర్వహణ, యంత్ర పరికరాలను పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రమోద్ కుమార్, విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, మండల ప్రత్యేకాధికారి నగేష్, తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో గోపాల్ తదితరులున్నారు.

టీఎన్జీవోస్ జిల్లా కార్యవర్గం ఎన్నిక



టీఎన్జీవోస్ జిల్లా కార్యవర్గ ప్రతినిధులు

కామారెడ్డి అర్బన్: తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం (టీఎన్జీవోస్) జిల్లా కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కేంద్ర సంఘం సూచన మేరకు జిల్లాలోని పాత తాలూకా కమిటీల కార్యవర్గ సభ్యులు, జిల్లా కార్యవర్గంలో పదవులు ఆశించినవారు శుక్రవారం హైదరాబాద్‌కు తరలివెళ్లారు. సంఘం అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నరాల వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మల్క నాగరాజు, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎం.చక్రధర్, కోశాధికారిగా ఎం.దేవరాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన ప్రకటించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా య.సాయిలు, జె.శ్రావణ్‌కుమార్, బి.లక్ష్మణ్, బి.రాజ్యలక్ష్మి, సంయుక్త కార్యదర్శులుగా ఈ.గణేష్, రమణకుమార్, అబ్దుల్‌ఖాదర్, జె.రాజమణి, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎం.సంతోష్‌కుమార్, ప్రచార కార్యదర్శిగా హెచ్.రాజ్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా కె.శ్రీకాంత్, వి.సాయినాథ్, ఎల్.రంజిత్‌కుమార్, బి.దత్తాత్రి ఎన్నికయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు సుమన్‌కుమార్, కార్యదర్శి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వీరన్నగుట్టలో ఉద్రిక్తత

- మతిస్థిమితంలేని ఏడేళ్ల బాలికపై అత్యాచారం!?
- నిందితుడిపై బాధితురాలి బంధువుల దాడి
- చికిత్స పొందుతూ మృతి
- దాడిచేసినవారి ఇళ్లపై మృతుడి కుటుంబ సభ్యుల ప్రతి దాడి
- భారీగా పోలీసుల మోహరింపు

రెంజల్: తాత వయసున్న వ్యక్తి మతిస్థిమితం లేని ఏడేళ్ల బాలికపై అత్యాచారం చేసినట్లు అనుమానించిన బాలిక బంధువులు.. అతడిపై తీవ్రంగా దాడి చేశారు. దీంతో నిందితుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. రెంజల్ మండలం వీరన్నగుట్ట తండాలో చోటుచేసుకున్న ఘటన వివరాలిలా ఉన్నాయి. గురువారం సాయంత్రం గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని బాలిక నాయనమ్మతో పక్కనే గల కిరాణా దుకాణానికి వెళ్లింది. బాలిక అక్కడే నిలిచిపోవడంతో వృద్ధురాలైన నాయనమ్మ ఇంటికి చేరుకుంది. కొద్దిసేపటికి బాలిక కోసం తల్లి అక్కడికి వెళ్లింది. బాలికపై దుకాణం యజమాని రత్నావర్ రెడ్యా అత్యాచారం చేసినట్లు అనుమానించిన తల్లి.. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపింది. ఈ క్రమంలో ఇరు కుటుంబాల మహిళలు పరస్పరం దూషించుకుంటూ ఘర్షణకు పాల్పడ్డారు. బాలిక తండ్రితో పాటు అతడి సోదరులు అక్కడికి చేరుకుని రెడ్యాను రోడ్డుపైకి తీసుకొచ్చి చితకబాదారు. కిరాణా దుకాణాన్ని ధ్వంసం చేయడంతో పాటు ఇంటిని తగల బెట్టేందుకు ప్రయత్నించారు. బాలిక బంధువు డయల్ 100కు ఫోన్ చేయడంతో రెంజల్ ఎస్సై సాయన్న సిబ్బందితో గ్రామానికి చేరుకున్నారు. రెడ్యాను నిజామాబాద్‌లోని ఆస్పత్రికి తరలించి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రెడ్యా శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందాడు. రూరల్ సీఐ విజయ్, ఎస్సై సాయన్న గ్రామానికి చేరుకుని దాడికి పాల్పడిన వారిని ముందస్తుగా అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అప్పటికే రెడ్యా మృతి చెందిన సమాచారం తెలుసుకున్న మృతుడి బంధువులు దాడికి పాల్పడిన వ్యక్తుల ఇళ్లపై దాడికి ప్రయత్నించారు. బాలిక తండ్రి ఇంటిని తగల బెట్టేందుకు వారు పెట్రోల్ బాటిల్‌తో రాగా పోలీసులు అడ్డుకున్నారు. గ్రామంలో పరిస్థితి విషమించడంతో ప్రత్యేక పోలీస్ బలగాలను రప్పించి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ట్రెయినీ ఐపీఎస్ అధికారి పత్తిపాక సాయికిరణ్ గ్రామానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. రెడ్యా గతంలో స్థానికంగా అప్పులు ఇస్తుండేవాడని, అతడి వద్ద డబ్బులు తీసుకున్న బాలిక బంధువులు దానిని చెల్లించలేక అత్యాచారం చేశాడని ఆరోపిస్తూ చితకబాది హత్య చేశారని మృతుడి బంధువులు ఆరోపించారు. పథకం ప్రకారం దాడి చేసినట్లు బోధన్ ఏసీపీ శ్రీనివాస్‌కు వివరించారు. రూరల్ సీఐతో పాటు నిజామాబాద్ సీఐ సురేశ్, ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్, ఆర్ఐ శ్రీకాంత్‌లతో పాటు సర్కిల్ పరిధిలోని నలుగురు ఎస్సైలు అదనపు పోలీసులు గ్రామంలో బందోబస్తులో పాల్గొన్నారు.



పోలీసులతో వాగ్వాదానికి దిగిన మృతుడి కుటుంబ సభ్యులు

పెరిగిన హాస్టల్ డైట్ చార్జీలు

- 40 శాతం పెంచిన ప్రభుత్వం
- నేటి నుంచి అమలులోకి...
- పండుగలా నిర్వహించనున్న అధికారులు



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, కేజీబీవీలు అన్నింటికీ ఒకే రకమైన భోజనం అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేసింది. అందులో భాగంగా డైట్ చార్జీలతో పాటు కాస్మెటిక్ చార్జీలను 40 పెంచింది. శనివారంనుంచి ఇది అమలులోకి రానుంది.

జిల్లాలో కేజీబీవీలు, గురుకులాలు, ఆయా సంక్షేమ హాస్టళ్లన్నీ కలిపి 129 ఉన్నాయి. వాటిలో ఉంటున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం, సౌకర్యాల విషయంలో ఒక్కోదానికి ప్రత్యేకాధికారిని నియమించి పర్యవేక్షిస్తున్నారు. అయితే డైట్ చార్జీలు తక్కువగా ఉండడంతో నాణ్యమైన భోజనం అందించలేక పోతున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం డైట్ చార్జీలను 40 శాతం పెంచింది. మూడో తరగతి నుంచి ఏడో తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రూ. 950 ఉన్న డైట్ చార్జీని రూ.1,330 కి పెంచారు. అలాగే ఎనిమిదో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు డైట్ చార్జీని రూ.1,100 నుంచి రూ.1,540 కి పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇంటర్ నుంచి పీజీ వరకు డైట్‌చార్జీని రూ.1,500 ల నుంచి రూ.2,100 కు పెంచింది.

నేడు హాస్టళ్లలో ప్రత్యేక కార్యక్రమాలు

డైట్ చార్జీలు పెరిగిన నేపథ్యంలో ఆయా హాస్టళ్లలో శనివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు స్కూళ్లు, కాలేజీలను స్పెషల్ గెస్టులు పరిశీలిస్తారు. 12 గంటల నుంచి 12.30 వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థులతో ఇంటరాక్షన్ ఉంటాయి. 12.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కామన్ డైట్ ప్లాన్ విడుదల, అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి భోజనం చేస్తారు. శనివారం మెనూ ప్రకారం చికెన్ కర్రీ, కూరగాయలతో భోజనం పెడతారు.

కాస్మెటిక్ చార్జీలు..

విద్యార్థులకు నెలనెలా ఇచ్చే కాస్మెటిక్ చార్జీలనూ ప్రభుత్వం పెంచింది. మూడో తరగతి నుంచి ఏడో తరగతి వరకు విద్యార్థినులకు గతంలో నెలకు రూ. 55 ఇచ్చేవారు. దాన్ని రూ.175 కు పెంచారు. ఎనిమిదో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థినులకు రూ.75 నుంచి రూ. 275 కు పెంచుతూ ఉత్తర్వులు ఇచ్చారు. మూడో తరగతి నుంచి ఏడో తరగతి వరకు బాలురకు రూ.62 ఉన్న కాస్మెటిక్ చార్జీలను రూ.150 కి, అలాగే ఎనిమిదో తరగతి నుంచి పదో తరగతి వరకు రూ.62 నుంచి రూ. 2 వందలకు పెంచారు. మగ పిల్లలు జుట్టు కత్తిరించుకునేందుకు చార్జీలు సరిపోక ఇబ్బందులు పడేవారు. పెరిగిన చార్జీలతో కొంత ఊరట లభించినట్టయ్యింది. అలాగే ఆడపిల్లలకు కూడా వాళ్ల అవసరాలకు ఏమాత్రం సరిపోయేవి కాదు. ఇప్పుడు పెరిగిన చార్జీలు కొంత ఊరట కలిగించాయనే చెప్పాలి.

నాణ్యత మెరుగుపడేనా..?

పెరిగిన ధరలకు అనుగుణంగా డైట్‌చార్జీలు పెరగకపోవడంతో ఇంత కాలం ఏది పెడితే అది తినే పరిస్థితి ఉండేది. అయితే ప్రభుత్వం 40 శాతం మేర డైట్ చార్జీలు పెంచిన నేపథ్యంలో హాస్టళ్లలో భోజనం మెరుగుపడాల్సిన అవసరం ఉంది. జిల్లాలోని అన్ని హాస్టళ్లకు ప్రత్యేకాధికారులను నియమించిన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్.. రెగ్యులర్‌గా ఆయా హాస్టళ్లను పర్యవేక్షిస్తున్నారు. ఇదే సమయంలో ప్రభుత్వం భారీగా డైట్ చార్జీలు పెంచినందున.. నిర్వాహకులు మెనూ అమలు చేస్తారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఏ అధికారి ఏ హాస్టల్‌కు వెళ్తారంటే..

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పెద్దకొడప్‌గల్ మండలం తక్కడపల్లిలోని గురుకుల పాఠశాలకు అతిథిగా వెళతారు. ఎస్పీ సింధుశర్మ జిల్లా కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాల(ఓల్డ్ కలెక్టరేట్)లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి బోర్లంలోని గురుకుల పాఠశాలలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొంటారు. అదనపు కలెక్టర్ విక్టర్ ఉప్పల్‌వాయిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఎల్లారెడ్డిలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో, జిల్లా అటవీ అధికారి నిఖిత గాంధారి మండల కేంద్రంలోని ఈఎంఆర్ఎస్‌లో నిర్వహించే కార్యక్రమానికి హాజరవుతారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు చీఫ్ గెస్టులుగా పాల్గొని కొత్త డైట్‌ను ప్రారంభించనున్నారు.

క్లుప్తంగా

గ్రూప్-4లో కానిస్టేబుల్ ప్రతిభ



భిక్కనూరు: ఇటీవల ప్రకటించిన గ్రూప్-4 ఫలితాల్లో భిక్కనూరు పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రాకేష్ జిల్లాలో మూడో ర్యాంక్ సాధించాడు. ఈ విషయమై శుక్రవారం రాకేశ్‌ను భిక్కనూరు సీఐ సంపత్ కుమార్, ఎస్సై సాయి కుమార్‌లు శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం రాకేష్‌ను పోలీస్ శాఖ నుంచి రిలీవ్ చేశారు. సీఐ సంపత్ కుమార్ మాట్లాడుతూ.. ప్రజలకు మంచి సేవ చేసి గుర్తింపు పొందాలని సూచించారు.

జాతీయ స్థాయి అర్చరీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



దోమకొండ: ఆలిండియా యూనివర్సిటీ జాతీయ స్థాయి అర్చరీ పోటీలకు దోమకొండకు చెందిన క్రీడాకారులు ఎంపికైనట్లు అర్చరీ కోచ్ ప్రతాప్‌దాస్ శుక్రవారం తెలిపారు. పోటీలకు దోమకొండ మండల కేంద్రానికి చెందిన కదిరే సింధూజ, బోరెడ్డి నిఖిత, భవాని ఎంపికైనట్లు కోచ్ వెల్లడించారు. ఈ నెల 24 నుంచి 27 వరకు ఒడిసా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో సింధూజ, నిఖిత ఉస్మానియా యూనివర్సిటీ తరఫున, భవాని తెలంగాణ యూనివర్సిటీ తరుపున పాల్గొంటారన్నారు. ఈ మేరకు ముగ్గురు క్రీడాకారులు భువనేశ్వర్‌కు తరలి వెళ్తున్నట్లు తెలిపారు. ముగ్గురు క్రీడాకారులను అర్చరీ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అనిల్ కామినేని, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి, సెక్రటరీ నర్సింహారెడ్డి, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు తిరుమల గౌడ్, సెక్రటరీ కదిరి మోహన్ రెడ్డి, ట్రెజరర్ గంగాధర్ అభినందించారు.

ఐఈఎస్‌కు మొగులాన్‌పల్లి యువకుడు..


సబావత్ ప్రేమ్ కుమార్

బాన్సువాడ రూరల్: మొగులాన్‌పల్లి తండాకు చెందిన సబావత్ ప్రేమ్‌కుమార్ అనే గిరిజన యువకుడు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే పరీక్షా ఫలితాల్లో ఆలిండియా 15వ ర్యాంకు సాధించారు. దీంతో ఆయన ఇండియన్ ఎకామిక్ సర్వీస్‌కు ఎంపికై దేశ ఆర్థిక నిపుణుడిగా ఉద్యోగం సాధించారు. ప్రేమ్ కుమార్ 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఆదిలాబాద్‌లోని జవహార్ నవోదయలో విద్యను అభ్యసించారు. అనంతరం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో ఇంటిగ్రేటెడ్ మాస్టర్ డిగ్రీ పూర్తి యూనివర్శిటీ స్థాయిలో అత్యుత్తమ మార్కులతో గోల్డ్ మెడల్ సాధించారు. ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తి చేసిన ప్రేమ్ కుమార్ మొదటి ప్రయత్నంలోనే ఇండియన్ ఎకనామిక్‌సర్వీస్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు.

శబరిమాత ఆలయ సేవకుడు మృతి


అంజన్న(ఫైల్)

తాడ్వాయి: మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమంలో పనిచేస్తున్న అంజన్న(70) గుండెపోటుతో శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన అంజన్న ఎనిమిదేళ్ల నుంచి ఆశ్రమంలో సేవ చేస్తూ జీవిస్తున్నారు. ఉదయం ఆశ్రమంలో సేవలు చేస్తుండగా గుండెపోటుకు గురయ్యాడు. ఆలయ కమిటీ సభ్యులు వెంటనే స్పందించి జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. భక్తుడిగా ఆశ్రమానికి వచ్చి సేవ లందించిన తీరు స్ఫూర్తి నిచ్చాయని సభ్యులు పేర్కొన్నారు.

మంత్రి ఉత్తమ్‌కు ఘన స్వాగతం

- పోలీసుల భారీ బందోబస్తు
- బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు


మంత్రికి స్వాగతం పలుకుతున్న సునీల్‌రెడ్డి


పునరుజ్జీవన పథకం పంపు హౌజ్ వద్ద పోలీసులు

బాల్కొండ: ఎస్సారెస్పీ సందర్శనకు రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటలకు హెలికాప్టర్‌పై వచ్చారు. మంత్రికి కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ ఘన స్వాగతం పలికారు. శాలువాతో సన్మానించారు. నియోజకవర్గంలో సాగు నీటి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎస్సారెస్పీ పర్యాటన సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ప్రాజె క్ట్ కాలనీతో పాటు, ఎస్సారెస్పీ గెస్ట్ హౌజ్, హెలిప్యాడ్, ప్రాజెక్ట్ ఆనకట్ట, ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం పంపు హౌజ్‌లను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. డీసీపీ, ఏసీపీ ఆధ్వర్యంలో పోలీసు బలగాలు మోహరించాయి. హెలిప్యాడ్ వద్దకు, ప్రాజెక్ట్ పైకి మీడియాను అనుమతించకుండా భద్రత ఏర్పాటు చేశారు. ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం పంపుహౌజ్ వద్ద ఇరిగేషన్ అధికారుల సమీక్షా సమావేశంలో బాల్కొండ, ఆర్మూర్, కోరుట్ల ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, పైడి రాకేశ్‌రెడ్డి, సంజయ్‌కుమార్ హాజరు కావడంతో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. బీఆర్‌ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు హాజరు కావడంతో ఏవైనా అల్లర్లు జరుగుతాయని భావించి భద్రతను పెంచారు. బాల్కొండ, మెండోరా, ముప్కాల్ మండలాల బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులను ముందస్తుగా అరెస్టులు చేసి స్వంత పూచీకత్తుపై సాయంత్రం విడుదల చేశారు.

ఆయకట్టు రైతుల ప్రయోజనాలను కాపాడండి


మంత్రికి వినతిపత్రం అందిస్తున్న బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

బాల్కొండ: ఎస్సారెస్పీ ఆయకట్టు రైతుల ప్రయోజనాలను కాపాడాలని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి విన్నవించారు. శుక్రవారం ఎస్సారెస్పీ సందర్శనకు వచ్చిన మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొని మంత్రికి ఎస్సారెస్పీలో ఉన్న సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఎస్సారెస్పీని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకం పైపులైన్‌లకు లీకేజీలు ఉండటంతో చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదని, లీకేజీలకు మరమ్మతులు చేపట్టాలని కోరినట్లు పేర్కొన్నారు. ప్యాకేజీ 21 పనులను పూర్తి చేస్తే రెండు లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు. తాను విన్నవించిన సమస్యలను మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

మరమ్మతులకు నిధులు కేటాయించండి


మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి

ఆర్మూర్: ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ఆధారంగా నిర్మించిన ఎత్తి పోతల పథకాల మోటార్ల మరమ్మతులకు నిధులు కేటాయించాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమా ర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ముప్కాల్ మండల శివారులోని ఎస్సారెస్పీ పునరుజ్జీవ న పథకం పంపు హౌజ్ వద్ద ఇరిగేషన్ అధికారులతో మంత్రి నిర్వహించిన సమీక్షలో ఎమ్మెల్యే పాల్గొన్నా రు. ఆర్మూర్ నియోజకవర్గంలోని నికాల్‌పూర్, మారంపల్లి, వన్నెల్(కే), తల్వేదా ఎత్తిపోతల మోటార్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. గుత్ప ఎత్తిపోతల పథకానికి అదనంగా మరో లిఫ్టును మునిపల్లి వరకు చేప ట్టిన పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఇది పూర్తయితే మాక్లూర్ మండలంలో 8, జక్రాన్‌పల్లి మండలంలో 5 గ్రామాలకు లబ్ధి చేకూరుతుందన్నారు. త్వరలోనే మంత్రి నిధులు మంజూరు చేస్తానన్నారని ఎమ్మెల్యే తెలిపారు.

ప్రయివేటీకరణ ఆలోచనను ఉపసంహరించుకోవాలి


నిరసన తెలుపుతున్న ఉద్యోగ సంఘాల నాయకులు

సుభాష్‌నగర్: ఉత్తరప్రదేశ్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో డిస్కాంల ప్రయివేటీకరణ ఆలోచనను ఉపసంహరించుకోవాలని జేఏసీ రాష్ట్ర నాయకులు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీ, ఉద్యోగ సంఘాలు దేశ వ్యాప్తంగా ధర్నా కార్యక్రమానికి పిలుపునిచ్చాయి. అందులో భాగంగా శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నగరంలోని పవర్ హౌస్ వద్ద విద్యుత్ ఉద్యోగులు జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా, నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. గతంలో ఢిల్లీ, ముంబైలో డిస్కాంల ప్రయివేటీకరణ చేయడానికి ప్రయత్నించగా, నష్టాలతో, వినియోగదారులకు సరైన సేవలు అందించక నిలిచిపోయిందని గుర్తుచేశారు. ఉత్తరప్రదేశ్‌లో కూడా ప్రయివేటీకరణ చేస్తామని ప్రకటించడంతో దేశవ్యాప్తంగా నిరసన, వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టడంతో నిలిచిపోయిందని, అయినా మరోసారి అక్కడి ప్రభుత్వం ప్రయివేటీకరణకు ముందుకు వస్తుందని తెలిపారు. ఈ నిర్ణయాన్ని ఉద్యోగ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని దీని వల్ల ఉద్యోగులకు కాకుండా ప్రజలకు తీరని నష్టం జరుగుతుందన్నారు. ప్రయివేటీకరణతో రైతులకు ఉచిత విద్యుత్, గృహ వినియోగదారులకు సబ్సిడీపై విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని అన్నారు. జేఏసీ కో కన్వీనర్ తోట రాజశేఖర్, జేఏసీ నాయకులు రాజేందర్ గౌడ్, పూదరి గంగాధర్, ఆర్ బాలేశ్ కుమార్, కాశీనాథ్, నాంపల్లి, అశోక్, మల్లేశ్, జాకీర్ అలీ, చెన్నయ్య, ప్రసాద్ రెడ్డి, రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్, రాజేందర్, శంకర్ గౌడ్, సునీత, నిజాముద్దీన్, నగేశ్, సతీశ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

దత్త జయంతి వేడుకలు



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని శ్రీ మాణిక్ ప్రభు ఆలయంలో గురువారం దత్త జయంతి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో వారం రోజుల నుంచి ప్రత్యేక పూజలు, నిత్యం భజనలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి పూజలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

15న సాఫ్ట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జెడ్పీ బాలుర పాఠశాలలో ఈనెల 15న సీనియర్ మహిళా సాఫ్ట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, మర్కంటి గంగామోహన్ శుక్రవారం పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 8 గంటలకు పాఠశాలలో కోచ్‌లు మౌనిక, నరేశ్, అనికేత్‌లను సంప్రదించాలన్నారు.

వెంచర్ అక్రమాలపై విచారణ ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..


వెంచర్‌లో విచారణ చేపడుతున్న అధికారులు

మాక్లూర్: మానిక్‌బండార్ శివారులోని సుమారు 217 ఎకరాల్లో ప్రయివేట్ వ్యక్తులు వెంచర్ వేసి అక్రమాలకు పాల్పడుతున్నారు. ఈ అక్రమాలపై ‘ప్రభుత్వ నిధులతో వెంచర్‌కు వంతెన’ అనే కథనాన్ని ‘సాక్షి’ దినపత్రికలో నవంబర్ 30న ప్రచురితం చేసింది. దీనిపై స్పందించిన ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు బఫర్‌జోన్ భూమిని శుక్రవారం పరిశీలించారు. వెంచర్ 217 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నందున పూర్తి విచారణకు సమయం పడుతుందని అధికారులు తెలిపారు. అలాగే బచ్చలకుంట చెరువుకు సంబంధించిన ఇరిగేషన్ భూమి కబ్జాకు గురైందా లేదా అనేది సైతం తేలాల్సి ఉంది. విచారణకు చేపట్టిన వారిలో ఇరిగేషన్ ఏఈ దివ్యభారతి, స్థానిక మాక్లూర్ ఆర్ఐ షఫీ, టౌన్ ప్లానింగ్ అధికారులు ఉన్నారు. వారి వెంట 2వ డివిజన్ కార్పొరేటర్ రాయ్‌సింగ్, గ్రామస్తులు ఉన్నారు.

వలకు చిక్కిన భారీ చేప



మోర్తాడ్: మండల కేంద్రంలోని చెరువులో మత్స్యకారుల వలకు గురువారం భారీ చేప చిక్కింది. 20 కిలోల బరువు ఉన్న చేప శుక్రవారం చిక్కడంతో విక్రయించేందుకు మార్కెట్‌లో ఉంచారు. మోర్తాడ్‌లోని ముసలమ్మ చెరువులో ఇలాంటి చేప దొరకడం ఇదే మొదటిసారి అని మత్స్యకారులు తెలిపారు.

క్రైం కార్నర్

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



డిచ్‌పల్లి: డిచ్‌పల్లి పీఎస్ పరిధిలోని ధర్మారం(బి)-మెంట్రాజ్‌పల్లి రోడ్డు పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం(50) లభించినట్లు ఎస్సై ఎండీ షరీఫ్ పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మెంట్రాజ్‌పల్లి వైపు వెళ్తున్న స్థానికులు రోడ్డు పక్కన వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి కుడిచేతిపై పుట్టుమచ్చ, ‘సీతా రమేశ్ గవాతే-నాందేడ్-కొండిబా’ అనే పచ్చబొట్టు ఉందని తెలిపారు. మృతుడి ఒంటిపై బ్లాక్ అండ్ వైట్ చెక్స్ షర్టు, బ్లాక్ కలర్ నైట్ ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతుడు మహారాష్ట్ర నాందేడ్ జిల్లాకు చెందిన వాడిగా పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తిస్తే 8712659851, 8712659852 నంబర్లకు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

బైక్ ఢీకొని రైతు మృతి


మల్లయ్య(ఫైల్)

మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ శివారులో కామారెడ్డి-సిరిసిల్ల రహదారిపై గురువారం రాత్రి బైక్ ఢీకొనడంతో ఓ రైతు మృతి చెందాడు. ఎస్సై అనిల్ శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కామటి మల్లయ్య(59) పొలం వద్దకు నడుచుకుంటు వెళ్తున్నాడు. వెనుక నుంచి ఓ వ్యక్తి బైక్‌పై వేగంగా వచ్చి మల్లయ్యను ఢీకొన్నాడు. ఈ ఘటనలో అతని తలకు బలమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం స్థానికులు కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలిస్తుండగా మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు..



ఖలీల్‌వాడి: లారీ ఢీకొని తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్న వృద్ధుడు మృతి చెందినట్లు నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఎస్సై శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 8న గాయత్రీనగర్‌కు చెందిన నాగేశ్వరావు శ్రీచైతన్య స్కూల్ వద్ద రోడ్డు దాటుతుండగా వర్ని చౌరస్తా వైపు వెళ్తున్న లారీ ఢీకొన్నది. ఈ ఘటనలో అతనికి తీవ్రగాయాలు కాగా స్థానికులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందాడు. కుమారుడు బాల మురళీకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రక్తదానం గొప్ప సామాజిక సేవ

అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి


విద్యుత్ ఉద్యోగుల రక్తదాన శిబిరంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఈ శ్రావణ్

కామారెడ్డి అర్బన్: రక్తం ఇవ్వడం ద్వారా ప్రాణాలు కాపాడే సామాజిక సేవ చాలా గొప్పదని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగుల మెగా రక్తదాన శిబిరం నిర్వహించగా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడం ద్వారా సహజమైన ఆరోగ్యం లభిస్తుందన్నారు. శిబిరంలో దాదాపు 50 యూనిట్ల రక్తం సేకరించారు. ఎస్ఈ శ్రావణ్‌కుమార్, ఎస్ఏవో రాజశేఖర్, డీఈలు కల్యాణచక్రవర్తి, నాగరాజు, ఏడీఈ కిరణ్ చైతన్య, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ ఎం.రాజన్న, ప్రతినిధులు పీవీ నరసింహం, విద్యుత్ యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

సీఎం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి


సమ్మె శిబిరం వద్ద బతుకమ్మ ఆడుతున్న ఉద్యోగులు

కామారెడ్డి టౌన్: సీఎం రేవంత్ రెడ్డి గతంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుని, తక్షణమే ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, అప్పటి వరకు పే స్కేల్ అమలు చేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ డిమాండ్ చేశారు. జిల్లాలో సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక సమ్మె శుక్రవారంతో నాలుగో రోజుకు చేరుకుంది. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం సమ్మె శిబిరం ముందు ప్రధాన రోడ్డుపై బతుకమ్మ ఆడి ఉద్యోగులు నిరసన తెలిపారు. సమ్మెలో సంఘం మహిళా అధ్యక్షురాలు వాసంతి, ఉద్యోగులు హరిప్రియ, కాళిదాస్, శైలజ, వనజ, గంగప్రసాద్, లక్ష్మణ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు పలువురి మద్దతు

ఉద్యోగుల సమ్మెకు డీటీఎఫ్ బాధ్యులు విజయ రామరాజు, బీవీఎం రాష్ట్ర నాయకుడు విఠల్, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరుణ్‌కుమార్, సీఐటీయూ నాయకుడు వెంకటిగౌడ్, వ్యవసాయక కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింలు తదితరులు మద్దతు తెలిపారు. ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు.

చదువుతోపాటు ఆటల్లో ప్రతిభను పెంపొందించుకోవాలి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి


విజేతలతో చంద్రకాంత్ రెడ్డి తదితరులు

భిక్కనూరు: విద్యార్థులు చిన్నతనం నుంచి చదువుతో పాటు ఆట పాటల్లో ప్రతిభను పెంపొందించుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం భిక్కనూరు మండల కేంద్రంలో సీఎం కప్ మండల స్థాయి విజేతలకు బహుమతుల ప్రధానం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉల్లాసాన్ని కలిగిస్తాయని చదువు సమాజంలో ఉన్నత శిఖరాలకు చేరుస్తుందన్నారు. ఆటల పోటీల్లో విజేతలకు సొంత డబ్బులతో బహుమతులను అందజేశారు. తహసీల్దార్ శివప్రసాద్, ఎంపీడీవో రాజకిరణ్‌రెడ్డి, ఎంఈవో రాజగంగారెడ్డి, మాజీ ఎంపీపీ గాలిరెడ్డి, సీఐ సంపత్‌కుమార్, ఎస్సై సాయికుమార్ పాల్గొన్నారు.

మర్కల్ విద్యార్థుల ప్రతిభ

సదాశివనగర్(ఎల్లారెడ్డి): సీఎం కప్ ఆటల పోటీల్లో మర్కల్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో క్రీడల్లో ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా బాలికల విభాగం ఖోఖోలో ప్రథమ బహుమతి, బాలుర విభాగంలో ద్వితీయ బహుమతి, బాలికల విభాగం కబడ్డీలో ద్వితీయ బహుమతి, వంద మీటర్ల పరుగుపందెంలో తృతీయ బహుమతిని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను గ్రామస్తులు అభినందించారు. ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఎంఈవో యోసెఫ్, ఎస్సై రంజిత్, తదితరులు పాల్గొన్నారు.


ట్రోఫీ అందుకుంటున్న మర్కల్ పాఠశాల విద్యార్థులు

గోనె సంచులు వచ్చాయ్..!

సాక్షి ఎఫెక్ట్..



పెద్దకొడప్‌గల్(జుక్కల్): పెద్దకొడప్‌గల్ సొసైటీ పరిధిలో గోనె సంచుల కొరత ఏర్పడి రైతులు ముప్పతిప్పలు పడుతున్నారని గురువారం సాక్షి పత్రికలో ‘సోయా రైతుల గోస పట్టదా’ అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం మధ్యాహ్నం వరకు పెద్దకొడప్‌గల్ సోయా కొనుగోలు కేంద్రానికి గోనె సంచులను పంపించేశారు. వెంటనే తూకం ప్రారంభిస్తున్నట్లు సొసైటీ కార్యదర్శి సందీప్ తెలిపారు. రైతులు ‘సాక్షి’కి ధన్యవాదాలు తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఒకరి రిమాండ్

నవీపేట: మండలంలోని స్టేషన్ ఏరియాలో ఈనెల 9న ఏఆర్ కానిస్టేబుల్ యాదగిరి ఇంట్లో జరిగిన హత్యాయత్నం కేసులో శుక్రవారం ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వినయ్ తెలిపారు. కుటుంబ కలహాల నేపథ్యంలో యాదగిరితో పాటు అతని బావలు రమేశ్, గంగాధర్‌లు భార్య ఇందిర, కుమారులపై దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. భార్య ఇందిర ఫిర్యాదు మేరకు యాదగిరి, రమేశ్, గంగాధర్‌లపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. రమేశ్‌ను అరెస్టు చేశామని, యాదగిరి, గంగాధర్‌లు పరారీలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ చోరీ కేసులో ఇద్దరు..

ఎల్లారెడ్డి: మండల కేంద్రానికి చెందిన బత్తుల హరికృష్ణ బైకును దొంగతనం చేసిన ఇద్దరు నిందితులను పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మహేశ్ శుక్రవారం పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. హరికృష్ణ తన బైకు చోరీకి గురైందని ఈ నెల 11న ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టినట్లు తెలిపారు. విచారణలో నాగిరెడ్డిపేట మండలంలోని జలాల్పూర్ గ్రామానికి చెందిన దొడ్లగోపాల్, ఎర్ర అశోక్ దొంగతనం చేశారని అన్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో భారీ మొత్తంలో పీడీఎస్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ సతీశ్‌రెడ్డి శుక్రవారం పట్టుకున్నారు. ఐచర్ వాహనంలో భారీ మొత్తంలో పీడీఎస్ బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం స్వాధీనం చేసుకున్న ఐచర్, పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ పేర్కొన్నారు.

డీజే ఆంప్లిఫైర్ ధ్వంసం

ఎల్లారెడ్డిరూరల్: పట్టణానికి చెందిన పవార్ సాయి తరుణ్‌కు చెందిన డీజే ఆంప్లిఫైర్‌ను ధ్వంసం చేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ శుక్రవారం తెలిపారు. సాయితరుణ్‌కు చెందిన డీజే ఆంప్లిఫైర్, కేబుల్స్‌ను నాగిరెడ్డిపేట మండలంలోని మెళ్లకుంట తండా, మహదేవునిగడ్డకు చెందిన రాందాస్, విఠల్, అనిల్, నరేందర్ ధ్వంసం చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నలుగురిపై కుక్కల దాడి



ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలోని 7, 8వ వార్డుల పరిధిలో నలుగురిపై కుక్కలు దాడి చేసి గాయపర్చినట్లు స్థానికులు శుక్రవారం తెలిపారు. పట్టణంలోని 7వ వార్డులో చిన్నారి కృత్విక, లక్ష్మయ్యతో పాటు 8వ వార్డులో మరో ఇద్దరిపై కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. పట్టణంలో కుక్కల బెడద తీవ్రమైందని వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఇసుక డంప్ స్వాధీనం



రుద్రూర్: ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను రెవెన్యూ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. పోతంగల్ మండలం కొడిచర్లలోని మూడు ప్రాంతాల్లో సుమారు 50 ట్రాక్టర్ల ట్రిప్పుల ఇసుక డంపులను సీజ్ చేసినట్లు తహసీల్దార్ మల్లయ్య పేర్కొన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు

బోధన్ రూరల్: గ్రామాల్లో ఎవరైనా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తప్పవని ఎస్సై మచ్చేందర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం సాలురా శివారులో నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను బోధన్ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్లను సీజ్ చేసి పీఎస్‌కు తరలించిన కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రాణాకలాన్‌లో చోరీ

ఎడపల్లి: మండలంలోని రాణాకలాన్‌కు చెందిన మోపుల కృష్ణారెడ్డి ఇంట్లో చోరీ జరిగింది. కృష్ణారెడ్డి వేరే గ్రామానికి వెళ్లి శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చాడు. తలుపులు తెరిచి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించినట్లు బాధితుడు తెలిపాడు. చోరీలో ఐదు తులాల వెండి, రూ. 50వేలు విలువ చేసే పట్టు చీరలు చోరీకి గురైనట్లు పేర్కొన్నారు.